**ప్రతి మనిషికి బయట ఒక ప్రపంచం ఉన్నట్టే లోపల ఆంతరంగిక ప్రపంచం ఒకటి ఉంటుంది. ఈ రెండు ప్రపంచాల మధ్య సమతౌల్యాన్ని సాధించడాన్నిబట్టే వ్యక్తిత్వం తయారవుతుంది. తనతో బయటి ప్రపంచం ఆడుకుంటున్నట్టే తన ఆంతరంగిక ప్రపంచం కూడా ఆడుకుంటూ ఉంటుందని గ్రహించడం ఎవరికైనా అంత సులభం కాదు. ఆ సంగతి తెలుసుకున్న వాడు ఆ రెండు ప్రపంచాలతోనూ తాను ఆడుకోవాలనుకోవడమూ అసహజం కాదు. బహిరంగ, అంతరంగిక ప్రపంచాలనే ఈ రెండు గోళాల సయ్యాటలో మనుషుల జీవితాలు ఊగిసలాడుతూనే ఉంటాయి.**

మధురాంతకం నరేంద్ర

# 8

# రెండు ఆకాశాలు

రాజు ఈపూరి





శూన్యంలో తేలిస్తున్న నిద్రలోంచీ, వణుకుతూ మెసేజీని మింగి తేన్చిన సెల్‌ఫోను, మెలకువలోకి లాక్కొచ్చింది. మంద్రంగా వూగుతున్న పడక నేను రైలులో వున్నానని గుర్తుచేసింది. అసంకల్పితంగా సెల్‌ఫోను అందుకుని, మరింత అసంకల్పితంగా దాని మీటలు మీటాను. పెనెం పైనుంచీ సగం చినిగి పళ్లెంలోకొచ్చిన మినపట్టులా, అరకొరగా, తాజాగా, సమాచారమొకటి తెరపైకొచ్చింది. యిప్పుడిప్పుడే తాను నేర్చుకున్న ప్రాంతీయ భాషలో సెల్‌ఫోను తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తోంది. సమాచారం మధ్య బీజాక్షరి, ముత్తుసామి, యెన్నెస్ కుప్పం, చిదంబరం అనే పేర్లు మాత్రం యింగ్లీషులో వున్నాయి. ఉదయం 8, 23-12-2015 అనే తేదీ గూడా ఉంది. మీ ఫోను నెంబరు దొరక్క ఆలస్యంగా సమాచారం అందిస్తున్నాను- అనే చివరి మాట మాత్రం చక్కగా యింగ్లీషులో పైన రాసిన సమాచారమేమిటో తెలుసుకోమని సవాలు చేస్తున్నట్టుగా...

బద్ధకంగా వొళ్లు విరుచుకుంటున్న వాడినల్లా, మనసు పొరల్లో జ్ఞాపకమేదో కదలాడటంతో గబాలున లేచి కూర్చున్నాను. చిన్న పావడా, జాకెట్టూ తొడుకున్న బుట్టబొమ్మ; పరికిణీలో వయ్యారంగా నడిచే కాలేజీ పిల్ల, చీకాకుపడుతూ కూర్చునే పెండ్లికూతురు, పిల్లలిద్దరినీ హాస్టల్లో చేర్పించిన యిల్లాలు... మరి రిటైరయిన తర్వాత బీజాక్షరి యేట్లాగుందో?

నీలిరంగు రాత్రి దీపాల వెలుతుర్లో బెర్త్‌ల పైన పడుకున్న శరీరాలు బట్టల మూటల్లా వూగుతున్నాయి. కిటికీలోంచీ కనబడుతున్న ప్రకృతి మంచుతెరల్ని కప్పుకుని, మరింతగా నల్లబారిపోయి వుంది. దూరంగా ఆకాశంలోని నక్షత్రాలు కవ్విస్తున్నాయి. కొన్ని నక్షత్రాలు నేలపైకి దిగుతున్నట్టుగా కనిపిస్తూ, వూరి శివార్లేవో దగ్గరవుతున్నట్టుగా హెచ్చరించాయి. 'చిదంబరం' అనే అక్షరాలు తగిలించుకున్న నిర్మానుష్యపు స్టేషను ప్లాట్‌ఫారమొకటి కిటికీ కవతల ఆగేసరికి, నా మనస్సు మరింతగా మొద్దుబారింది. సరిగ్గా యీ వూరు రాబో

తూండగా, యీ వూరికే రమ్మంటూ సమాచారం రావటం యెలా సాధ్యమైంది? నా బతుకును వేర్వేరు దశలుగా మలుస్తున్నట్టుగా, యిలా బీజాక్షరెందుకు నన్ను సంధిస్తోంది? నిముషాల్ని యుగాలుగా మార్చాక రైలు కూత కూసింది. వెన్నులో మెరుపేదో మెరిసినట్టుగా వులిక్కిపడి, నా జిప్‌బాగ్ చేతబట్టుకుని, ఫ్లాట్ ఫామ్ పైకి దూకాను.

"యీ రోజెందుకో రైలు అయిదు నిముషాలెక్కువగా ఆగిందిక్కడ!" అంటున్నాడు వెలిసిన వెంట్రుకల స్టేషను మాస్టరు నాకేసి వురిమి చూస్తూ.

నేను దిగడం కోసమే అంతసేపు ఆగినట్టుగా రైలింతలో పరుగు లఘించింది.

స్టేషన్ మాష్టరు కేసి నిర్లిప్తంగా చూస్తూ, "యెన్నెస్ కుప్పం," అన్నాను.

"బస్టాండు... 9 కిలోమీటర్స్..." అన్నాడతను చేతులతో దారి చూపిస్తూ.

చిదంబరం ఆకాశం బూడిద కుప్పలా నల్లబారే వుంది. ఆరని నిప్పురవ్వల్లా నక్షత్రాలు మినుకు మినుకుమంటున్నాయి. వీధి దీపాల గుడ్డి వెలుతురులో రోడ్లు నిద్రపోతూనే వున్నాయి. పాత ఆటో నన్ను బస్టాండుకు చేర్చేసరికి, అక్కడి ముసలి హోటళ్ల పెరళ్లలోంచీ పొగగొట్టాలు బూడిద రంగు పొగల్ని పైకి ఎగజిమ్ముతున్నాయి. బస్టాండు రేకుల కింద, కొళాయిల దగ్గర, దంతధావనాలు చేసుకుంటున్నవాళ్లూ, ముఖాలు కడుక్కుంటున్న వాళ్లూ పోటీ పడుతున్నారు.

అప్పుడే నీళ్లల్లో మునిగివచ్చిన యెనుబోతు లాంటి బస్సొకటి, వికృతమైన శుభ్రతతో మెరుస్తూ వచ్చి ఆగింది. కాకీబట్టలు తొడుక్కున్న వ్యక్తొకడు కిందికి దూకి, "కందాపురం... కొయిలూరు..అమ్మన్ తాంగల్... యెన్నెస్ గుప్పం," అని అరిచాడు. 'యెన్నెస్ కుప్పం' అనే మాటను గుర్తుపట్టి, దాని వూతంతో బస్సులోకి దూరాను.

"యిదు యిస్పెషలు సర్వీసు... నీ కోసరందా యేసుంటారు," అంటూ వో ముసలాయిన పక్కన కూర్చున్న ముసలావిడతో తమిళయాసలో సరాగాలు పోతున్నాడు.

'కాదు... నాకోసమే వచ్చిందీ బస్సు,' అని అరవాలనిపించింది.

కిటికీలోంచీ చల్లని గాలులు వీస్తున్నా, నాకు మాత్రం చెమటలు పడుతున్నాయి. బస్సులో కిక్కిరిసిన జనమున్నా, నన్నెవరూ పట్టించుకోవడం లేదు. నా ఆలోచనలన్నీ 'బీజాక్షరి' అనే నాలుగు అక్షరాల చుట్టే అల్లుకుపోయాయి. కళ్లు తెరిచే వున్నా నాకు మరేమీ కనిపించటం లేదు. చెవుల్లోకి యింకో శబ్దమేదీ దూరటం లేదు. బస్సెంత వేగంతో పరిగెత్తుతోందో తెలియడం లేదు. బడిలో నిద్రపోయిన పాపాయి, రాత్రంతా చదివి కళ్లను యెర్రబార్చుకున్న పడుచుపిల్ల, పెళ్లెవరిదో

అయినట్టుగా విసుక్కునే పెళ్లికూతురు, పెత్తనమంతా తనదే అయినట్టుగా మిడిసిపడే పెద్దక్క... యిప్పుడు ముసలిదయిన బీజాక్షరిలో ఆ వెటకారమెంత చేదెక్కి వుంటుందో?...

కండెక్టరు యెన్నెస్ గుబ్బం అని కేకేశాడు. గబుక్కున నిల్చున్న నన్ను వెనక నుంచీ యెవరో నెట్టారు. వుదయపు వెలుతురుకు నా కళ్లు అలవాటు పడుతూండగా, బస్సు నా ముఖం పైన చిమ్మిపోయిన పొగలు పలచబడుతూండగా, యెదురుగా కరెంటు స్థంబానికి కట్టిన ఫ్లెక్సీ బోర్డు కనిపించింది. పెద్ద ముత్తయిదువు ఫోటో కింద 'బీజాక్షరి' అనే పేరూ, దాని కింద యిటు వెళ్లండని చెప్పే బాణం గుర్తూ, నా కోసమే యెదురు చూస్తున్నట్టుగా పలకరించాయి. ఫోటోలో నాకు తెలిసిన పోలికలు వెదుకుతూ కదిలాను. వీధి చివర్లో మరో పటం మరో బాణం గుర్తుతో దారి చూపెట్టింది. ఆ దారి యేడడుగుల వెడల్పున్న సన్నటి సందులోకి తిరిగి, దారినంతా ఆక్రమించు కున్న షామియానా కింద దూరి, మలుపు తిరుగుతోంది. షామియానా కింద, అద్దె కంపెనీ పేర్లున్న ప్లాస్టిక్ కుర్చీల్లో, అయిదారుమంది నడివయస్సు మగవాళ్లు కూర్చుని వున్నారు. నేను వెళ్లి పక్కనే కూర్చున్నా వాళ్లెవరూ నన్ను పలకరించలేదు. యెదురుగా వున్న పెంకుటింట్లో హడావుడేమీ లేదు. ఫ్లెక్సీ బోర్డులు బహుశా బీజాక్షరి వుద్యోగంలో రిటైరయి వుంటుందనీ, దాని కోసం యిప్పుడిక్కడ విందు యేర్పాటు చేసి వుంటారనీ చెబుతున్నట్టుగా తోచింది.

పొడవాటి గౌను తొడుక్కున్న చిన్న పాపాయొకతి యింట్లోంచీ వచ్చి, పక్కనున్న వాళ్లను పట్టించుకోకుండా, నా కుర్చీ చుట్టూ తిరుగుతూ ఆడుకోసాగింది. ఆ పిల్లదాని ముఖంలో పాత విసుగేదో తొంగి చూడగానే వులిక్కిపడ్డాను. సందేహం లేదు, యీ పిల్ల బీజాక్షరి మనవరాలై వుంటుంది. నేను మొదటిసారిగా చూసినప్పుడు బీజాక్షరి గూడా యిలాగే వుండేది. దానికి నన్ను చూపిస్తూ మా అమ్మ, 'బావే! బావా అని పిలవాలి!' అని ముద్దుబోయింది. అపుడక్కడున్న ఆ పిల్ల తల్లి- ఆవిడ నాకు అత్త అవుతుందని మా అమ్మ ఆ తరువాత చెప్పింది. 'చిన్న పిల్లలకలా పాడు వరసలు నేర్పకండి నాకు నచ్చదు,' అని కోప్పడింది. మా అమ్మ చిన్నబుచ్చుకున్నా ఆవిడ పట్టించుకోలేదు. మా చిన్నమామకు సేల్స్ టాక్సులో పెద్ద వుద్యోగం రావడం, ఆయనకు గుడ్లవల్లేరు నుంచీ పేద్ద సంబంధం రావడం, పెళ్లవుతూనే మా చిన్నత్త మా చిన్నమామను పిల్లిని చేసి ఆడించడం, ఆయన తోడబుట్టిన వాళ్లను మాత్రమే గాకుండా తల్లిదండ్రుల్ని గూడా నిరాదరణ చేయడం, చివరకు తన అమ్మానాన్న చనిపోయినప్పుడు కూడా ఆయన చుట్టపుచూపుగానే వచ్చి వెళ్లటం, ఆయనా తర్వాత

టౌనులో పెద్ద యిల్లు కట్టుకోవడం, యెప్పుడో తప్పనిసరయినప్పుడు మాత్రమే ఆ కుటుంబం మాకెదురుగావడం- యిదంతా అన్ని యిళ్లల్లోనూ జరిగే పాత కథే! మా అమ్మకు పుట్టిల్లన్నదేమైనా వుంటే అదేదో మా పెద్దమామ యింట్లోనే దొరికింది. మా పెద్దమామ బతకలేని బడిపంతులు. గయ్యాళితనంలో మా పెద్దత్త మా చిన్నత్తకేమీ తీసిపోదు. అయితే మా పెద్దమామ చిన్నత్తలా నియంతగాదు. ఆయన పెద్ద ప్రజా స్వామికవాది. ఆ యింట్లో భార్యాభర్తలిద్దరూ ప్రతిపక్షాల్లా కీచులాడుకుంటూనే వుండేవాళ్లు. అక్కడ కేవలం ప్రేక్షకురాలిగా మాత్రమేగాకుండా, అప్పుడప్పుడూ స్పీకర్ పాత్ర గూడా దొరకడం మా అమ్మకెంతో సంబరంగా వుండేది.

పాపాయి చెవి మెలి తిప్పుతూ వో యువతి, ''టిఫన్ రెడీ,'' అంటూంటే తిరిగి చూశాను. మమ్మల్నంతా యింట్లోకెళ్లమన్నట్టుగా సైగ చేస్తోందావిడ.

వరండాలో అద్దె యినప బెంచీలపైన వుపాహారం పొగలు గక్కుతోంది. సన్నగా, పొడుగ్గా వున్న ఆ యింటి లోపలికి తొంగి చూశాను బీజాక్షరి కోసం. యిల్లంతా ఖాళీగా వుంది. యిది వరకూ వచ్చి వెళ్లిన యువతి మరోసారి టిఫను వడ్డించడం కోసం వచ్చింది. ఆవిడ ముఖంలోని చీకాకు గూడా చాలాకాలం క్రితం బీజాక్షరిని జ్ఞాపకం చేయడంతో విస్తుపోయాను.

నేను యేడవ తరగతి చదువుతోండగా మా నాన్న కాలం చేశాడు. పల్లెటూర్లో మిగిలిన రెండెకరాల పొలం తప్పితే మరో ఆధారం లేదు. నా చదువుకు సహాయం చెయ్యమని పెద్ద వుద్యోగం చేస్తున్న మా చిన్నమామ దగ్గరికే ముందుగా తీసుకెళ్లింది మా అమ్మ. ఆ పెద్దయింటినీ, ఆ దర్జానూ చూసి తబ్బిబ్బు పడుతున్న నన్ను డాబుగా తిరుగుతూన్న అత్తగానీ, దర్జాగా తిరిగే పిల్లాడుగానీ, చివరకు పనివాళ్లుగానీ పలక రించలేదు. హాల్లోనే అటూ యిటూ తిరుగుతున్న ఆడపిల్ల- బీజాక్షరి గూడా నాకూ అక్కడున్న కుర్చీలకూ, సోఫాకూ తేడా లేనట్టే తిరిగింది. రేడియోనూ, గ్రామ్‌ఫోన్నూ తాకాలన్నా నాకు భయమేసింది. మూడోరోజున మా అమ్మ, 'వాడెప్పుడో మారిపోయి నాడురా! యిక్కడికి రావడమే మన తప్పు,' అని యేడుస్తూ తిరిగొస్తూంటే, నేను మాత్రం ఆ యింట్లో మొదటి తరగతి జైలుశిక్ష తప్పిపోయినట్టే సంతోషించాను.

టిఫను తిన్నాక మళ్లీ షామియానా కింద కొంగ జపం చేయక తప్పలేదు నాకు. యిదివరకూ టిఫిను వడ్డించిన అమ్మాయి బీజాక్షరి కూతురే అయివుండాలి. నాకు తెలిసిన వాళ్లెవరూ కనిపించడం లేదు. నన్ను గుర్తుపట్టినవాళ్లూ లేరు. నా చదువు ముగిశాక, వుద్యోగమొకటి వుద్ధరించాక, మా చిన్నమామ యింటికి మా అమ్మ రెండోసారి లాక్కెళ్లినప్పుడు గూడా అక్కడ నన్నెవరూ గుర్తుపట్టలేదు. అన్ని

సంవత్సరాల తర్వాత ఆ యింటికలా వెళ్లడానికి నాకూ చిరాకుగానే వుందప్పుడు. మా నాన్న పోయాక, మా అతీగతీ పట్టించుకోని వ్యక్తి దగ్గరికెళ్లి, 'నీ కూతుర్ని నా కొడుక్కియ్య'మని అడగడానికి మా అమ్మ మాత్రం సందేహించలేదు. 'బాంధవ్యం, అది నీ హక్కురా,' అని గదమాయించింది. వోణీపావడాల్లో పుస్తకాలు చేత బట్టుకుని కాలేజీకెళ్లి వస్తున్న ఆ మెరుపుతీగను చూసినప్పుడు నేను గూడా అమ్మమాట నిజమే గదా అనుకున్నాను. ఆ పిల్లను చూస్తూ అక్కడున్న రెండు రోజులు మొదటి తరగతి జైలుశిక్షను పూలపడవ ప్రయాణంగా మార్చుకున్నాను. చివరికెప్పుడో మా చిన్న మామ అపాయింట్‌మెంటిచ్చినప్పుడు మా అమ్మను పాత అవమానమే వెక్కిరించింది. 'వాడి పెళ్లాం వాణ్ణి కోతినిచేసి ఆడిస్తోందిరా,' అని మా అమ్మ సర్దుకుపోయింది. 'కొట్టినా తిట్టినా పెద్దమామేరా మనవాడు,' అంటూ ఆమె చివరకు తన పెద్దన్న కూతుర్నే నాకు కట్టబెట్టింది. నా పెళ్లికి మా చిన్న మామొక్కడే వచ్చి వెళ్లాడు. చదివింపుల పేరుతో వెయ్యి రూపాయలు మా అమ్మచేతిలో పెట్టి వెళ్లాడట! వాడి కూతురి పెండ్లిలో ఆ వెయ్యీ వాడి ముఖానే కొట్టేస్తానులే అంది మా అమ్మ. కానీ తన కూతురు పెండ్లి చెయ్యకుండానే మా చిన్నమామ బాల్చీ తన్నేస్తాడని మా అమ్మ కప్పటికెలా తెలుస్తుంది? వురుమూ, మెరుపులేకుండా వచ్చిన తుఫానులా వచ్చిందా వార్త. హార్ట్ అటాక్ అన్నారు. చనిపోయాక కూడా నిద్రపోతున్నట్టే వున్నాడు, అంటూ మా అమ్మ భోరుమంది. ఆయన శవమై పడివున్నప్పుడు గూడా మా చిన్నత్త మావైపు బంధువులను పట్టించుకోలేదు. కర్మాంతరాలకు మేమెవరూ వెళ్లనేలేదు.

షామియానా కింద కూచున్న ముసలాయన గోడతో మాట్లాడుతున్నట్టుగా వెనక్కు తిరిగి, "తోపుకాడికి పోయూడ్సినారంతా... పోదాం రండ," అన్నాడు తెలుగూ తమిళమూ కలిసిన భాషలో. బహుశా బీజాక్షరి కూడా అక్కడికెళ్లిందేమో! నేనూ వాళ్లననుసరించాను.

భూమిని రెండుగా చీలుస్తున్న భూమధ్యరేఖలా వరిపొలాల నడుమ మట్టి బాట... ఆ చోటునంతా కప్పేడుతున్నట్టుగా పైన బోర్లించిన ఆకాశం... బాట పక్కన బెరుకుగా పారుతున్న నీటి కాలువ... అక్కడక్కడా నిలబడిన ఆశ్చర్యార్థకాల్లా కొబ్బరిచెట్లు...

యిన్ని రోజులుగా నన్ను పట్టించుకోని బీజాక్షరి యిప్పుడీ ఫంక్షనుకెందుకు ఆహ్వానించింది? కోపమూ, ఆశ్చర్యమూ, సంభ్రమమూ ముంచెత్తుతున్నాయి.

మా బాటలో ముందుగా కొందరాడవాళ్లు వెళ్తున్నట్టున్నారు. దూరం నుంచీ వో పట్టుచీర జిగేల్మంది. బీజాక్షరి వెళ్తుందేమో! తన పెళ్లిరోజున యిలాగే మెరిసే పట్టుచీరలో కనిపించిందామె.

ముప్పయ్యేళ్ల క్రితం జరిగిన సంగతే అయినా నిన్నే జరిగినట్టుగా బాగా గుర్తుంది. యెప్పట్లాగే అప్పుడు కూడా మా చిన్నత్త నుంచి మా వైపు వాళ్లెవ్వరికీ సరిగ్గా ఆహ్వానాలు అందలేదు. పెళ్లికొడుకుది తమిళనాడులో యెక్కడో చిన్న పల్లెటూరట! వుద్యోగం మాత్రం చెన్నయిలోనన్నారు. మావైపు వాళ్లే గాదు, పెళ్లికొడుకు తరపునుంచి గూడా జనమంతగా రాలేదు. నేనూ మా ఆవిడా మాత్రం వెళ్లాం. 'మా పిన్నికి మనుషులంటేనే చేదు. కూతురుద్యోగం చేస్తోందని టెక్కుగూడా! యెవరు మాత్రం యెందుకొస్తారు?' అని మా ఆవిడ వాపోయింది. పండు చలికాలం. తోలప్ప గార్డెనులో పెళ్లి. సాయంత్రం ఆరుకంతా చీకటైపోయింది. వరుడ్ని కాస్త దూరం వూరేగింపుగా తీసుకొచ్చేసరికి మంచులో తడిసిపోయామంతా. రాత్రి భోజనాలయ్యాక పెండ్లి మండపం వరండాలోనే పడుకున్నాం. కప్పుకోడానికేమీ లేక వణికిపోయాం. మా గురించి పట్టించుకున్నవాళ్లెవరూలేరు. తెల్లవారుజామున మూడు గంటలప్పుడు యిద్దరు ముసలివాళ్లు నన్నూ, నా భార్యనూ బలవంతంగా నిద్రలేపి కూర్చోబెట్టారు. కన్యాదానం చేయటానికి మేము తప్ప మరెవరూ లేరట! మాకోసం వెదుకుతూ చాలామందికి నిద్రాభంగం చేసినందుకు విలవిల్లాడిపోతూ, తప్పంతా మాదే అయి నట్టుగా నిలదీశారు. నా భార్య ముఖం తిప్పేసింది. పంతాలూ పట్టింపులకిది సమయంగాదనీ, యెంతకాదన్నా పెండ్లికూతురుతో మాకిద్దరికీ రక్త సంబంధముందనీ, కేవలం కన్యాదానం చేసేవాళ్లు దొరక్కపోవడంతో పెండ్లికి యిబ్బంది రాగూడదనీ, కన్యాదానమంటే వెయ్యి యజ్ఞాల పుణ్యమనీ వాళ్లు వాదించారు. వేడినీళ్ల స్నానమే అయినా ఆ చలిలో వణికిపోయాం.

వియ్యంకులిచ్చిన కొత్త బట్టలు కట్టుకుని పీటల పైకి వెళ్తాండగా 'పెండ్లీ చేసుకుందామనుకున్నారు. యిప్పుడీ కన్యాదానమైనా దొరికిందని భలే సంతోషంగా వుంది మీకు,' అని నా భార్య దెప్పి పొడిచింది. యేడవలేక నవ్వుతూ, 'చిన్నాన్న కూతురికి కన్యాదాతనయ్యానని నువ్వే మురిసిపోతున్నావు,' అని నేనూ నా భార్యను కవ్వించాను.

పెళ్లి జరుగుతున్నంతసేపూ 'అక్కా, బావా' అంటూ పెండ్లికూతురూ, ఆమె తమ్ముడూ, 'అన్నా వదినా' అంటూ పెళ్లికొడుకూ వరసలు పెట్టి పిలుస్తూంటే సంబరం తో తలకిందులైపోయాం. పెళ్లిలో వాళ్లుపెట్టిన బట్టల్ని తరువాత కట్టుకున్నప్పుడల్లా 'యిప్పుడు వాళ్లు మనల్ని తలుస్తున్నారా చూడండి. యేరుదాటగానే తెప్ప తగలేశారు,' అని నా భార్య వాపోయేది. ఆ బట్టలు చిరిగిపోయాక ఆ మాటలు గూడా అనడం మానేసింది.

మట్టిబాట మామిడి తోటలోకి చేరేసిన చోట, చెట్లకింద, నేలపైన పరిచిన జంబుఖానాలపైన యిరవై ముప్పయిమంది మనుషులు కనిపించారు. గుంపులోని వాళ్లెవరూ మాట్లాడుకోవడం లేదు. సరైన చిరునామాకే వచ్చానా లేదా అన్న సందేహం తో అందరినీ కలయజూశాను. బీజాక్షరే కాదు, ముత్తుసామి కూడా లేడక్కడ.

ముత్తుసామిని నాలుగైదుసార్లు చూశానేమో! మా చిన్నత్త వాడికి వాళ్ల తండ్రి పేరు పెట్టిందని మా ఆవిడకు మొదట్లో వాడంటే పెద్దగా గిట్టేదిగాదు. పది సంవత్సరాల క్రితం వొక పెండ్లిలో చూశానతడిని. అదేమంత ముఖ్యమైన పెళ్లిగాదు. అప్పటికి మా చిన్నత్త గూడా పోయింది. ఆ పెళ్లికి బీజాక్షరి మొగుడితో బాటూ వస్తోందని మా ఆవిడ పనిగట్టుకుని లాక్కెళ్లింది. అప్పుడు ముత్తుసామి యేదో బాంకులో మేనేజరుగా పని చేస్తున్నాడు. యెంతయినా స్వంత చిన్నాయన కొడుకు గదా, వాడికెలాగైనా మా కూతుర్నిచ్చి పెళ్లి చేసి, బంధుత్వాన్ని నిలుపుకోవాలని మా ఆవిడ పెద్ద మంత్రాంగం చేసింది. ఆ యింటికిప్పుడు పెద్దయిన బీజాక్షరికక్కడే చెక్ పెట్టాలని నా భార్య ఆలోచన. ఆ పెండ్లి గోలలోనే బీజాక్షరిని పట్టుకుని, బీజాక్షరి మొగుడ్ని 'మరిదిగారూ' అని పిలుస్తూ తన చుట్టరికాన్ని గుర్తుచేసి, వాళ్ల ముందు తన ప్రపోజల్‌ని ప్రవేశపెట్టింది. కానీ రెండు మూడు నిముషాల్లోనే బీజాక్షరి యెవరి చోటేదో వాళ్లు తెలుసు కోవాలని దులిపిపారేసింది. నా భార్య ముఖంలో కత్తివేటుకు నెత్తురుచుక్క లేదు. మా వొక్కగానొక్క కూతురికి పెండ్లికొడుకు దొరక్కపోడని నేనామెను వోదార్చాను. ఆ తర్వాత మాకు తగిన అల్లుడు మాకు దొరకనే దొరికాడు లెండి! మరో మూడేళ్ల తర్వాత ముత్తుసామి పూనాలో యెక్కడో మరాఠీ పిల్లను పెండ్లి చేసుకున్నాడని తెలిసింది. ఆ మరాఠీ పిల్లతో ముత్తుసామికి నాలుగేండ్ల పరిచయముందని అన్నారెవరో. జరగని పెండ్లికి తానే పెద్దయినట్టుగా బుకాయించిన బీజాక్షరికి తగిన శాస్తే జరిగిందని మా ఆవిడ యెద్దేవా చేసింది.

జందెం వేసుకుని, చూడగానే బ్రాహ్మణుడని తెలిసిపోతున్న వో వ్యక్తి, చెట్టు కింద, నేలపైన పీటేసుకుని కూర్చుని, దర్భపోచలతో పవిత్రాలు చేయసాగారు. మరో వ్యక్తి అతడి ముందు యిసుకను మూడు కుప్పలుగా పోసి, వోకో కుప్పలో వో చిన్న రాతిని నిలబెట్టాడు. అప్పటికిగానీ అక్కడ చనిపోయిన వ్యక్తికి దివసాలు తీరుస్తున్నారని నాకు అర్థంగాలేదు. యింతకూ చనిపోయిందెవరు? గుండెల్లో అనుమానం ముల్లుతో గుచ్చసాగింది.

అంతవరకూ గుంపులోనే కూర్చున్న వ్యక్తి వొకడు బ్రాహ్మణుడికి ఎదురుగా నేలపైన కూర్చున్నాడు. యిరవై ముప్పయి రోజుల గడ్డం, మాసిన తల, పుల్లబారిన

పంచ. వయస్సు అరవై దాటి వుండచ్చు. అతడు చొక్కా విప్పి, పొడవాటి గుడ్డపీలికను జందెంలా వేసుకున్నాడు. బ్రాహ్మణుడు అతడి చేత రాళ్లపైన సీకాయ, నూనె వేయిస్తూ, యేవేవో పేర్లడిగి తెలుసుకుని, వాటిని మళ్లీ తాను వల్లిస్తున్నాడు. ఆ వ్యక్తి పేరేదో గొణిగాడు. బ్రాహ్మణుడా పేరందుకున్నాడు. నిజమే! నా అనుమానం తప్పుగాదు. నేను విన్నది మరో పేరేదీగాదు. బీజాక్షరి... బీజాక్షరి చనిపోయిందా? పద్మూడు రోజుల క్రితం... నాకు సెల్ ఫోన్‌లో అందిన సమాచారమదేనా? యెన్నెస్ కుప్పంలో కనిపించిన ఫ్లెక్సీ ప్రకటన కర్మక్రియలదా? భాష తెలియకపోవడంతో బీజాక్షరి యింకా బతికే వుందనుకున్నాను. చచ్చిపోయిన మనిషిని చూడ్డం కోసం యిలా పరిగెత్తు కొచ్చానా నేను? ఆమె చనిపోయిందని తెలిసుంటే, చేస్తున్న ప్రయాణాన్ని అర్ధాంతరంగా ఆపుకుని, యింత దూరం వచ్చేవాడినా నేను?

నా చుట్టూ కూచున్న జనంలో యెవరూ పెద్దగా బాధ పడుతున్నట్టు లేరు. బీజాక్షరి భర్త పెరిగిన గడ్డం లోపల చిరునవ్వేదో దాగినట్టుగా నాకనుమానం వస్తోంది. యిందరికీ లేని దుఃఖం నాకు మాత్రమే యెందుకొస్తోంది? వాళ్లందరికీ అది పద్మూడు రోజుల పాత వార్త గావడమూ, నాకది యిప్పుడే తెలిసిన తాజావార్త గావడమూ కారణమా? యింత తతంగానికి కారణమైన బీజాక్షరిని యీ గుంపంతా యెందుకు తలచుకోవడం లేదు? ఆమె గురించి తప్ప మరో ఆలోచన నాకు మాత్రమెందుకు రావడం లేదు? మనస్సు మళ్లీ మొద్దుబారుతోంది.

యే అడవిలోనో వెదురుగా పుట్టి, యే కర్మాగారంలోనో కాగితంగా మారి, యే ప్రచురణాలయంలోనో దినపత్రికగా తయారై యీ వూరు చేరిన నిన్నటి దినపత్రిక ముక్కొక్కటి, నేటిని పోగొట్టుకుంటూ, క్రతువు జరుగుతున్నచోట, కర్పూరం కింద కాలిపోతోంది. మామిడి చెట్ల పైన్నుంచీ సూర్యుడు కుతూహలంగా తొంగిచూస్తున్నాడు.

తోట లోపలికో ఆటో పొగలు గక్కుకుంటూ వచ్చి ఆగింది. దానిలోంచీ దిగిన వ్యక్తిని ముత్తుసామని పోల్చుకోగానే నాకెందుకో మళ్లీ యేడుపు తన్నుకు రాబోయింది. కానీ అతడు నిర్లిప్తంగా నవ్వుతూ, రైలు లేటయిందని సంజాయిషీ యిస్తున్నాడు. వెంటనే పనిలోకి దిగుతున్న వాడిలా నా పక్కనుంచే చాలాసార్లు తిరిగాడు. నన్ను గుర్తుపట్టక పోతాడా అన్న ఆశతో నేనతడి ముఖంలోకి గుచ్చిచూశాను.

‘‘యెన్నడా ముత్తూ! మీ అక్క పక్కన్నించీ వచ్చిండేది నువ్వు వొగడే దానే! కనాకష్టం నీ పెండ్లామునైనా తోడ్కరాగూడదా! యిద్దరయినా అయివుందురు,’’ అంటున్నాడో ముసలాయిన.

ముత్తుసామి మోహమాటంగా తప్పుకున్నాడు. అయితే నన్నతడు గుర్తుపట్ట లేదన్నమాట! అతగాడు గూడా నన్ను చూసింది నాలుగైదుసార్లే గదా! యిటీవలి కాలంలో నేను పెంచుకున్న ఫ్రెంచి గడ్డమూ, మీసాలూ వాడికి నా పోలికల్ని దొరక నివ్వడం లేదేమో! నాకతగాడి పైన జాలేసింది. యింతలో నాకు మెసేజ్ పంపింది ముత్తుసామే అయివుంటాడని స్ఫురించింది. తమ తరపున బంధువులెవరూ రాకుంటే బాగుండదని, యెన్ని అవమానాలు జరిగినా మరచిపోయి పిలుస్తూనే పరిగెత్తుకొచ్చే వాళ్లెవరో కనిపెట్టి, నాకా వార్తను పంపాడన్నమాట! వాడిపైన చెప్పలేనంత కోపం వచ్చింది. తరువాత ఆ కోపం నాపైకే మర్లింది.

క్రతువు ముగిసినట్టుంది. అందరూ పైకిలేచి వూరేగింపుగా కదిలారు. నడుస్తున్న దూరాన్ని బాధతోనూ, కోపంతోనూ, విసుగుతోనూ, యిదీ అని చెప్పలేని ఆవేదనతోనూ కొలుస్తూ, గుంపులో నడుస్తున్నా వొంటరితనాన్నే మోస్తూ నేనూ నడవ సాగాను.

వాళ్లంతా షామియానా కింద ఆగారు. నా కాళ్లు నన్ను అసంకల్పితంగా బస్టాండుకు లాక్కొచ్చాయి. ముసలావిడ బోసినవ్వులా బస్టాండు నిర్మానుష్యంగా, వికారంగా వుంది. నీలోహిత కుప్పం (యెన్.యెస్. కుప్పం) అనే బోర్డు కింద, వొంటరి రాతి రచ్చబండపైన, రాతిబొమ్మలా కూర్చున్నాను. కాలాన్ని నా నిట్టూర్పులూ, మూల్గులూ సాగదీయసాగాయి.

"మీరు దినాల కొచ్చిన వాళ్లేగదా? భోం చేయకుండా వచ్చేశారా?" తలెత్తి చూశాను. యెదురుగా ముత్తుసామి.

"ఆమా... యిల్లయి..." అని నేను కావాలని తమిళంలో సమాధానం చెప్పాను. అతను బుర్ర గోక్కుంటూ మళ్లీ అదే ప్రశ్నను యింగ్లీషులో అడిగాడు. మళ్లీ నేను తమిళంలోనే గొణిగాను.

"తమిళ్ వచ్చిన వాళ్లెవరైనా పంపాలి..." అంటూ అతను తిరిగి వెళ్లిపోయాడు.

బీజాక్షరి చనిపోయిందని బాధపడుతున్నానా? లేకపోతే నాతో వాళ్లిలా ఆడు కున్నారని బాధపడుతున్నానా? లేకపోతే రెండూనా? దూరంగా కొండల పక్కన దిగులుగా వంగుతున్న ఆకాశం తప్ప మరేమీ కనిపించడం లేదు.

బస్సొకటి ముక్కుతూ మూల్గుతూ వచ్చింది. అదెక్కడికెళ్తుందనయినా చూడ కుండా, వీలయినంత త్వరగా ఆ వూరిని దాటుకోవాలన్న తొందరలో, దాని మెట్ల పైకి దూకాను. యినప పెనం నెత్తిన బెట్టుకుని దిగుతున్న ముసలావిడ ఢీకొట్టడంతో కిందికి విసురుక పడ్డాను. చుట్టూ జనం మూగారు. స్మారకమొచ్చేసరికి నేనో పెంకుల

ఆస్పత్రి మంచంపైనున్నాను. ముసలి డాక్టరు యింజెక్షనేదో పొడుస్తున్నాడు. నా బుగ్గలపైనా, గడ్డంపైనా రక్తం డాగులున్నాయి. మంగలివాడొకడు నా ముందు కూచుని క్షవరం చేయడానికి సిద్ధమవుతున్నాడు. నేను నీరసంగా నవ్వాను. క్షవరం ముగిశాక డాక్టరు నా బుగ్గలపైనా, గడ్డంపైనా టించరు పూసి బాండేజీ అతికించాడు. రక్తపు మరకలున్న చొక్కా తీసేసి, మరోటి తగిలించుకున్నాను.

అరగంట తర్వాత డాక్టరుకు డబ్బులిస్తూ, ''థాంక్యూ సార్! నౌ అయామ్ ఆల్ రైట్... ఐహావ్ టూ కాచ్ దీ ట్రయిన్ అర్జెంట్లీ,'' అన్నాను. డాక్టర్ తమిళంలో యేదో అన్నాడు.

బస్సీసారి త్వరగానే వచ్చింది. అది కదులుతూండగా ముత్తుసామి చేతి సంచీతో బాటూ బస్సెక్కటం కనిపించింది. చోటుకోసం వెదుకుతున్న అతడి చూపులు నా దగ్గర ఆగలేదు. గడ్డలూ మీసాలూ లేకపోవడం, కొత్త చొక్కా తొడుక్కోవడం, నాకు మంచి మారువేషాన్నే సంతరించినట్టున్నాయి అతనక్కడే ఫుట్ బోర్డ్ దగ్గర నిల్చున్నాడు.

సెల్‌ఫోను మోగింది. మా ఆవిడ! చెవులకు యియర్ ఫోన్లు తగిలించుకుని పలకరించాను. నిన్నటి నుంచీ ఫోనెందుకు చేయలేదని దబాయిస్తోంది. జరిగినదంతా చెప్పాను.

''మధురైలో అర్జెంటు పనుల్ని మరచిపోయి అక్కడ దిగేశారా? ఆ మరదలంటే మీకెంత యిష్టమో నాకు తెలియదా? చనిపొయ్యిందని ముందుగా తెలిసున్నా వెళ్లే వుంటారు,'' అందావిడ.

ఫొనెందుకో కట్టయింది. పిల్లల ధ్యాసలో పడి ఆవిడే నన్ను రోజుల తరబడీ మరచిపోతుందని నాకు బాగా తెలుసు. నిన్నటి నుంచీ యింతవరకూ నేను గూడా ఆమెను పూర్తిగా మరచిపోయానని నాకప్పుడు స్ఫురించింది. నేను మరచిపోయినంత మాత్రాన ఆవిడ లేనట్టూగాదు. యీ పద్మూడు రోజులుగా నాకు తెలియకపోయినా, నిన్నటి నుంచీ ఆవిడ గురించే ఆలోచిస్తున్నా బీజాక్షరి బతికి వున్నట్టూగాదు. మన స్సంతా కంగాళీగా వుంది.

మళ్లీ జరిగినదంతా మననం గావడంతో రకరకాల దశల్లో నా బతుకుతో చెలగాటమాడిన బీజాక్షరిపైన కోపం ముంచుకొచ్చింది. వెంటనే మా ఆవిడ మాటలు గుర్తుకొచ్చి, నాతో దాగుడుమూతలాడుతున్నది బీజాక్షరి గాదేమోనన్న అనుమానమూ వచ్చింది..

నా కుడి చెవి దగ్గర నరమేదో వుబుకుతోంది.

చిదంబరం చేరువవుతోందని తెల్పడం కోసమన్నట్టుగా దూరంగా ఆలయ శిఖరాలు కనబడుతున్నాయి. వుదయం ఆ వూర్లోంచీ వస్తున్నప్పుడు అవి కనిపించలేదు. ఆ ఆకాశమంతా నక్షత్రాలే కనిపించాయి.

అప్పుడు కూడా ఆ చీకట్లో, ఆ గోపుర శిఖరాలు నిలిచే వుండేవని తలుచుకుంటే నాకు గగ్గుర్పాటు కలిగింది.

నా లోపలి చీకట్లో సైతం గోపురాలేవో కదలాడినట్టు తోచడంతో వివశుణ్ణయిపోయాను.


ఆకాశం గోపురాల చెవుల వరకూ వొంగి చిదంబర రహస్యమేదో చెబ్తోంది.

నేను ముత్తుసామిని దగ్గరకు రమ్మని సైగ చేసి, పక్కకు జరిగి, చోటిచ్చాను.

అతను కూచుంటూండగా, ''మీరీ ప్రాంతం వాళ్లలా లేరు. యేవూరి నుంచీ వస్తున్నారు?'' అని అడిగాను.

*ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక*
*మే 2016*

*




మధురాంతకం నరేంద్ర 16 జులై 1957న జన్మించారు. వీరి మొదటి కథ ***చివరికి దొరికిన జవాబు*** 1975లో ఎస్.వి. గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజి మేగజైన్‌లో అచ్చయ్యింది. కుంభమేళా, అస్తిత్వానికి అటూ-ఇటూ, రెండేళ్ల పధ్నాలుగు కథాసంపుటాలు, ఐదు నవలలు ప్రచురించారు. కథావార్షికకు సహసంపాదకులు. తాత్త్విక కథలు సంకలనానికి సంపాదకులు. ఎస్.వి. యూనివర్సిటీలో ఇంగ్లీషు ప్రొఫెసర్.

***చిరునామా: 15-54/1, శ్రీ పద్మావతీ నగర్, తిరుపతి - 517 502***
***ఫోన్: 98662 43659*** *manarendra@gmail.com*